# అంతర్నేత్రం

మా నాన్న, పార్వతి నాన్న బాల్య స్నేహితులు. ఒకే ఊళ్ళో పుట్టి పెరిగారు గదా! అదే ఆల వరసల్లో వాళ్ళమ్మా, మా అమ్మా నేస్తాలయ్యారు. ఆ నలుగురు కూడబలుక్కుని ఓ శుభముహూర్తాన పార్వతి మెడలో నాతో మూడు ముళ్ళేయించారు. ఇద్దరమూ ఒకే ఊళ్ళో పుట్టాము, పచ్చని చేలల్లో తిరిగాము. పార్వతి... నా పెళ్ళామని గొప్పలు చెప్పుకోవడం కాదు గానీ... మంచుకొండల్లో విచ్చుకున్న మల్లెలాగుంటుంది.

కాని... ఎంత అందగత్తెనో అంత బోళామనిషని ఎప్పుడో అనుమాన మొచ్చినా అది... ఈ పట్టణానికొచ్చాక ధృవీకరించుకున్నాను. ఎంతయినా సగం ప్రాణం కదా! నేనో పెద్దాఫీసర్ను. తలుచుకుంటే జీతాన్ని మించి గీతం సంపాదించగలను. అది నా మనస్తత్వం కాకపోయినా "మీరు పెద్ద ఉద్యోగంలో ఉన్నారు. మనూళ్ళో స్థిరాస్తులున్నాయి. నీతి నిజాయితీలకు నీరాజనం పడుతూ మచ్చలేని మహారాజులా, పులుకడిగిన ముత్యంలాగుంటేనే పురుషార్థం" అంటూ నెలకోసారన్నా గీతాసారాన్ని గుర్తుచేస్తుంది.

ఈ పట్టణానికి మా పల్లెటూరు దగ్గరే. పల్లెటూరు జనాలు వివిధ పనుల కోసం పట్నం రావటం సహజమే. ఆర్టీసీని అయోమయంలో పడేసి ఆటోలు వీరవిహారం చేస్తున్న రోజులివి. కేజీ పల్లీనూనె కావాలన్నా, పప్పు - సబ్బు కావాలన్నా, ఫ్యాషన్‌గా గెడ్డం గీయించుకోవాలన్నా ఊరి జనాలు దర్జాగా ఆటో ఎక్కేస్తారు. ఇక్కడ పనులన్నీ ముగించుకుని తిరిగి వెళ్తారు. కాలేజికొచ్చే కుర్రకారు సంగతి సరే...

ఈ సోదంతా ఎందుకంటారా? అందులోనే వుంది అసలు నిజం. నేనీ పట్నం వచ్చినప్పట్నుంచి చూస్తున్నాను... మా ఊరివారు ఇక్కడికొచ్చి మధ్యాహ్న సమయం మా ఇంటికొచ్చి "బాగున్నారా పార్వతమ్మా!" అంటూ పలుకరిస్తారు. ఊరివారి సేవయే ఉత్తమగతులకు దారి అనుకున్న మా ఆవిడ "బాగున్నాను రండి! స్నానం చెయ్యండి.

ఈలోగా వంట చేస్తాను" అని వారికిష్టమైన వంటకాలు తయారు చేసి కొసరికొసరి వడ్డిస్తుంది. దగ్గరుండి భోంచేయిస్తుంది. కొందరైతే ఆ రోజు పనులు పూర్తికాకపోతే రాత్రికి మా ఇంటి వరండాలో సేదదీరి, మర్నాడు పనులన్నీ చక్కబెట్టుకుని మధ్యాహ్నం భోంచేసి వెళ్తారు.

నాకిదో తలనొప్పిగా తయారైంది. వ్యవహారం శృతిమించి పోతుందేమోనని ఒంటికి కారం రాసుకున్నట్టనిపిస్తుంది. "ఇదేంటి పార్వతీ! మనూరు దగ్గరేకదా! నువ్వు వండి, వార్చి పెడుతున్నావని వాళ్ళిక్కడికొస్తున్నారు. లేకపోతే వాళ్ళ దారి వారు చూసుకుంటారు. మన ఇల్లు ధర్మసత్రం కాదు గదా!" అంటే, కొంగు నడుముకు బిగించి బుగ్గలు నొక్కుకుంటూ "అయ్యోరామా! మనం మానవమాత్రులమండీ, సంపాదించిన దాన్ని సద్వినియోగం చెయ్యడమంటే ఇదేనండి. ఇది గృహస్థధర్మం. మానవ సేవయే మాధవసేవ అన్నారు గదా!" అని నా నోరు నొక్కేస్తుంది.

ఆవిడ అభిప్రాయం నన్ను అయోమయంలోముంచెత్తినా తేలుకుట్టిన దొంగలా మిన్నకుండడం తప్ప మరోదారి లేదాయె.

ఆరోజు సోమవారం. పనిమనిషి సాయంతో పార్వతి ఇంటి పనులు చేసుకొంటూంది. నేను ఆఫీసు పనిమీద హైద్రాబాదుకు వచ్చాను. ఆఫీసు పని అయ్యేసరికి అపరాహ్నం దాటిపోయింది. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. హెూటల్లో భోంచేస్తున్నాను.

సెల్‌ఫోన్ రింగయింది. "అయ్యా! అమ్మగారు మెట్లమీంచి పడిపోయింది. ఇప్పుడు దవాఖానలుంది. మీరు జల్ది రావాలయ్యా!" పనిమనిషి గొంతు వణుకుతోంది. నా గుండెల్లో గుండ్రాయి దొర్లింది.

మిగిలిన మెతుకుల నలాగే వదిలేసి యమర్జంటుగా బయలుదేరాను. రెండు గంటల ప్రయాణం. పార్వతికెట్లా ఉందో! అసలు... స్పృహలో ఉందో లేదో! వెంట ఎవరైనా ఉన్నారో లేదో!... మనసులో సందేహాలు ప్రశ్నాబాణాలు.

బస్టాండులో దిగగానే హాస్పిటల్‌కు ఆటోలో చేరుకున్నాను. తేనె తుట్టి చుట్టూ తేనెటీగల్లా పార్వతి మంచం చుట్టూ మా ఊరు వారున్నారు. పార్వతి లేచి కూర్చుంది.

"ఏమండీ! ఈ రోజుతో నాకీలోకంతో ఋణం తీరిపోయిందనుకున్నాను" గుండెలమీద ఒరిగిపోయింది. "అసలేమైందీ?" పనిమనిషి నడిగాను.

"ఏమోనయ్యా! బంగ్లా దిగుతూ పడిపోయిందయ్యా... ఇదో వీళ్ళు అక్కడే ఉన్నారు

కాబట్టి వెంటనే దవాఖానకు తీసుకొచ్చారయ్యా" అంది. చేతులు పిసుక్కుంటూ మా ఊరివాళ్ళను చూపించింది.

"నా భార్యకేమైంది డాక్టర్?" ఆత్రంగా డాక్టర్‌నడిగాను.

"షీ ఈజ్ లక్కీసార్! హార్ట్ స్ట్రోక్... ఇదో వీళ్ళు వెంటనే తీసుకొచ్చారు కాబట్టి వెంటనే ట్రీట్‌మెంట్ ప్రారంభించాము. ఏమాత్రం ఆలస్యమైనా ప్రమాదం జరిగేది. ఇప్పుడు మీ భార్యకు ప్రాణాపాయం తప్పింది. మున్నాల్గు రోజుల్లో డిస్చార్జ్ చేస్తాం".

(వేదిక కథల పోటీలో బహుమతి పొందిన రచన)

(విశాలాక్షి - జనవరి 2012)

కథా నిలయం
శ్రీకాకుళం